RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 178 | జూన్ 10, 2025 | వెల : రూ.3-00



మెరుగైన వైద్యం అందించాలి

2లో..



## భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్యాయత్నం !

- గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నం
- అన్న అమ్మను బాగా చూసుకో, వాలీబాల్ ఆట బతకాలి అంటూ సూసైడ్ నోట్

**వేద న్యూస్, శాయంపేట:**

భార్య వేధింపులు తట్టుకోలేక ఓ ఆర్మీ జవాన్ ఆత్మహత్యాయత్నం చేశాడు. గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నం చేశాడు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండలంలోని మైలారం గ్రామానికి చెందిన అరికిల్ల ప్రవీణ్ తిరుమలగిరిలోని టెరిలోరియల్ ఆర్మీ 125 బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలోనే పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన రజినిక అనే అమ్మాయితో 2020లో వివాహమైంది. అయితే గత కొంత కాలంగా భార్యాభర్తలిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. భార్యతో పాటు అత్తింటి వారు సైతం ప్రవీణ్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. డ్యూటీకి వెళ్లకుండా ఐడీ కార్డు దాచి పెట్టి వేధించారు. ప్రవీణ్ రెండు నెలల క్రితం డ్యూటీకి వెళ్లగా తన భార్య బెటాలియన్ వద్దకు వెళ్లి గొడవ చేసింది. పై అధికారులకు లేనిపోని విషయాలన్నీ చెప్పి ప్రవీణ్ పరువు తీసింది. దీంతో ఆయన తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. సెలవుల నిమిత్తం ఈ నెల 6న

4లో..



# లేనోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు

- ఉన్నోళ్లకు ఇచ్చే ప్రసక్తే లేదు
- మొదటి విడతలో బహుపేదోళ్లకు ఇచ్చాం
- మిగిలిన విడతల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇస్తాం
- ఏదులాపురం మున్సిపాలిటీ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**వేద న్యూస్, ఖమ్మం :**

ఇందిరమ్మ ఇండ్లు లేనోళ్లకే ఇస్తామని.. ఉన్నోళ్లు ఆశించినా వాళ్లకు ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చే ప్రసక్తే లేదని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి, తెల్దారుపల్లి, పోలేపల్లి ప్రాంతాల్లో బీటీ, సీసీ రోడ్లకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజలు ఏరికోరి తెచ్చుకున్న ఇందిరమ్మ ప్రభుత్వానికి ఏడాదిన్నర పూర్తి కావొస్తుందని తెలిపారు. ఈ ఏడాదిన్నర కాలంలో మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, రైతు భరోసా, సన్నాలకు బోనస్, రేషన్ షాపుల ద్వారా ఉచిత సన్నబియ్యం ఇలా అనేక సంక్షేమ పథకాలను ప్రజల దరి చేర్చామని పేర్కొన్నారు. ఇంకా అమలు చేయాల్సిన హామీలు కొన్ని ఉన్నాయని వాటన్నింటిని కూడా ఒక్కరోజు ఆలస్యమైనా అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్లే సంక్షేమ పథకాలు ప్రజల దరిచేర్చడంలో కాస్త ఆలస్యమవుతుందని తెలిపారు. తొలి విడతలో ఇందిరమ్మ ఇండ్లను పేదవాళ్లలో బహుపేదవాళ్లకు ఇవ్వడం జరిగిందన్నారు. రెండు, మూడు, నాలుగు విడతలు కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. ఇప్పుడు ఇళ్లు రాలేదని బాధపడొద్దని రాబోయే విడతల్లో వారి కి ఖచ్చితంగా ఇచ్చే బాధ్యత తనదని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో వచ్చే ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసే వారికి ప్రజల ఆశీస్సులు అందించాలని కోరారు.

## ఆపరేషన్ కగార్ ను ఆపివేయాలి

- విప్లవకారులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి - వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వేద న్యూస్, హన్మకొండ :**

ఆదివాసులపై జరుగుతున్న దాడిని వ్యతిరేకిస్తూ, శాంతి చర్చలకు సుముఖంగా ఉన్న మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలను జరపాలని కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో "శాంతి చర్చలు - విద్యార్థుల బాధ్యత" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఐ (మావోయిస్ట్) పార్టీ శాంతి చర్చల జరపాలని పలు దఫాలుగా ప్రకటనలు విడుదల చేసినా కేంద్ర ప్రభుత్వం చర్చలకు సానుకూలత చూపకపోగ వ్యతిరేకిస్తున్న సందర్భంలో సమాజంలో ఉన్న ప్రజలు ఏ పాత్ర వహించాలి అని మేధావులు, విద్యార్థి సంఘాలు చర్చించారు. డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. ఈ



కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశం అయిన భారతదేశం శాంతిని కోరుకునే దేశం అని, మావోయిస్టులు చర్చలకు సానుకూలంగా ఉన్నా ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడం సరికాదని అన్నారు. శాంతి చర్చలకు సానుకూల వాతావరణం ఏర్పడడానికి ముందుగా కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటన చేయాలనీ, ఆపరేషన్ కగార్ లో చనిపోయేవాళ్ళు ఈ దేశ పౌరులు, ఆదివాసులేననీ, ఏ సమస్య అయినా శాంతితో, చర్చలతోనే ముగుస్తుందనీ, ఆపరేషన్ కగార్ రాజ్యాంగ వ్యతిరేకమని, రాజ్యాంగం బద్ధంగా

4లో..



## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- రాష్ట్ర మంత్రి సీతక్క

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళా సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రి సీతక్క, సి.ఎస్ కే.రామ కృష్ణా రావు లతో కలిసి బడి బాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

4లో..

## మత్తు పదార్థాల అలవాట్లు ఉంటే మానుకోవాలి



**వేద న్యూస్, మడికొండ :**

మత్తు పదార్థాల అలవాట్లు ఉంటే మానుకోవాలని మడికొండ సీఐ కిషన్ తెలియజేశారు. సోమవారం మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నందు పని చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 300 మంది కార్మికులతో

2లో..

## మహాలక్ష్మి పథకం వల్లే ఆర్టీసీ లాభాల్లో ఉంది

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ లాభాల బాటలో కొనసాగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సోమవారం సూర్యాపేట బస్ డిపో నందు ఎలక్ట్రిక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్లతో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కాలుష్యం నుండి పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొన్ని వాతావరణంను కాపాడుకుంటూ ఆర్టీసీ సంస్థ ముందుకు వెళ్తుందని పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ మంత్రి అయినప్పటినుండి ఆర్టిసిలో సమూల మార్పులు తెచ్చి అనేక సంస్కరణలతో ముందుకు వెళ్ళటం శుభ పరిణామం అని తెలిపారు. గతంలో సామాన్యుడి అవసరాలు తీర్చేందుకు ఆర్టీసీ సంస్థ ఎంతగానో కృషి చేసింది కానీ లాభాలు లేకుండా ఎప్పుడూ నష్టాల బాటలో కొనసాగిందని కానీ ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఆర్టీసీ అనే ప్రభుత్వ సంస్థను కాపాడుకునేందుకు, ఆర్థికంగా నిలబెట్టేందుకు తగు చర్యలతో ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. పాత బస్సులను, డీజిల్ బస్సులను పక్కకి పెట్టి ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా వాతావరణాన్ని కాపాడుకుంటూ ప్రజలకు సేవ చేసేందుకు సూర్యాపేట డిపోకు 79 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరైనాయని వాటిలో ఈరోజు 45 ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.రాష్ట్ర రాజధాని, ఔటర్ రింగ్ రోడ్ లోపల, హైదరాబాద్ అనే మహానగరంలో వాతావరణ ఆహ్లాదకరంగా ఉండేందుకు 2800 ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటుచేసి సామాన్యులకు రవాణా



- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

4లో..

# సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

**– షీ టీమ్ సీఐ సుజాత**




**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

విద్యార్థులు అవగాహన లేకుండా స్మార్ట్ ఫోన్ వాడొద్దని ప్రస్తుతం సమాజంలో అనూహ్య రీతిలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని షీ టీమ్ సీఐ సుజాత అన్నారు. వరంగల్ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు షీ టీమ్ సీఐ సుజాత వరంగల్ నగరంలోని కరీమాబాద్ గవర్నమెంట్ హై స్కూల్లో సోమవారం డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సుజాత మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని పేర్కొన్నారు. ఫోన్లో ఓటీపీ, గూగుల్ పే, ఫోన్ పే కేవైసీ అప్డేట్ చేయమని వచ్చే మెసేజ్ స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు డయల్ చేయాలన్నారు. సైబర్ క్రైమ్ కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపవద్దన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను ప్రతి ఒక్కరు కచ్చితంగా పాటించాలని అన్నారు. బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే 100,181,మహిళల హెల్ప్ లైన్ నెంబర్ 1098లను, వరంగల్ షీ టీమ్ నెంబర్ 8712685142 కి సమాచారం ఇవ్వాలన్నారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# పల్లె ప్రకృతి వనాన్ని ధ్వంసం చేయద్దు




**వేద న్యూస్,శాయంపేట:**

శాయంపేట మండలం గంగిరేణిగూడెం గ్రామంలో కేసీఆర్ హయాంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనాన్ని నరికి వేసి అక్కడ గ్రామపంచాయతీ భవనం నిర్మించుటకు అధికారులు సిద్ధమై గ్రామస్తులు వద్దని మొరపెట్టుకున్నా కొందరి నాయకుల ఒత్తిడి వల్ల శంకుస్థాపన కూడా పూర్తి చేశారు అని మాజీ వైస్ ఎంపీపీ లత లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందచేశారు. గతంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మార్వో పరిశీలించి నిర్ధారణ చేసిన 0.06 గుంటల కాలి స్థలం పల్లె ప్రకృతి వనానికి పక్కనే ఉన్నందున గ్రామస్తుల కోరిక మేరకు ఆ స్థలంలోనే నిర్మించాలే తప్ప పల్లె ప్రకృతి వనాన్ని నాశనం చేయకూడదని గ్రామస్తుల సహకారంతో వినతి పత్రం అందచేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో జాలిగాపు అశోక్, ఎండి మగ్దున్ పాషా, పోతు రమేష్, పెరుమాండ్ల కుమారస్వామి, సప్పిడి పోషాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు బడి వద్దు..సర్కార్ బడి ముద్దు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడిలో చేర్పించే విధంగా ప్రభుత్వం బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లాల్లో ప్రవేట్ పాఠశాలలు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించే విధంగా ఉపాధ్యాయులు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా లభిస్తుందని ఇంటింటికి తిరుగుతూ ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల 10 ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించిన విధానాన్ని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. అంతేకాకుండా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కూడా మెండుగా ఉన్నాయని పేర్కొంటున్నారు. జిల్లాలో ఉన్న పాఠశాలల్లో ఇప్పటికే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ లు,కంప్యూటర్లు స్క్రీన్లు చేరుతున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు దోహదపడుతుందని పేర్కొంటున్నారు. తల్లిదండ్రులకు ప్రైవేట్ బడి వద్దు..ప్రభుత్వ బడి ముద్దు అనే సంకల్పం దృఢంగా ఉంటుందన్నారు. ఇదిలా ఉంటే రేవంత్ సర్కార్ విద్య బలోపేతమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటుంది. చదువు మానేసిన పిల్లలని కూడా బడికి పంపించే విధంగా ఇప్పటికే ప్రభుత్వం సంబంధించిన అధికారులకు ముమ్మరం చేస్తున్నది.




**– ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు**
**:జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి**

విద్యార్థులు బడి మానేసి తిరుగుతున్న వారిని గుర్తించి బడిలో చేర్పించే దిశగా చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా లభిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, కంప్యూటర్ స్క్రీన్లు చేరాయని తెలిపారు. విద్య బలోపేతం చేయడమే విద్యాశాఖ లక్ష్యమన్నారు. జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలో విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన విద్యను అందిస్తామని స్పష్టం చేశారు.

# మత్తు పదార్థాల అలవాట్లు ఉంటే మానుకోవాలి

మొదటి పేజీ తరువాయి

సమావేశం ఏర్పాటు చేశారు. మడికొండ ప్రాంతంలో నేరాలను అదుపుచేయడం కోసం వివిధ రాష్ట్రల కార్మికుల యొక్క వివరాలు తీసుకోవడం జరిగిందన్నారు. అంతేగాక వారు ఏదైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు ఉన్నట్లయితే అవి మానుకోవాలని వారి మీద ఏదైనా వారి రాష్ట్రాలలో కేసులు నమోదైనట్లయితే అట్టి వివరాలు కూడా స్థానిక పోలీస్ స్టేషన్లో సమర్పించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమం లో రైల్వే ప్రతినిధులు, మడికొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రేమించి పెళ్లాడి..

# మనస్థాపంతో ఆత్మహత్య..!



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

నువ్వంటే నాకిష్టం.. నువ్వు లేకుండా నేను బతకలేనని చెప్పి పెళ్లాడాడు. ఆపై కొద్ది రోజులకే మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు.. విషయం తెలుసుకున్న భార్య తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండల పరిధిలోని రాజీవ్ నగర్(జంకు తండ),వెంకటాద్రిపాలెం కు చెందిన దివ్య నాలుగు సంవత్సరాల క్రితం యాదగిరి పల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ ను ప్రేమించి పెద్దలను ఎదిరించి వివాహం చేసుకుంది. కాగా గత రెండు సంవత్సరాలుగా వెంకటేష్ మరో మహిళతో అక్రమ సంబ ంధం పెట్టుకున్నాడని తెలుసుకొని పలుమార్లు ప్రశ్నించగా తనను వేధించేవాడని వారు ఆరోపిం చారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ సోమవారం ఉదయం దివ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వీరికి ఒక పాప, ఒక బాబు ఉన్నారు. ఐతే తన కూతురు దివ్య మరణానికి భర్త వెంకటేష్ కారణమని,భర్త వేధింపులు తట్టుకోలేక ఎవరికీ చెప్పుకోలేక తన కూతురు చనిపోయిందని మృతురాలి తల్లి శోభ ఆరోపించారు. తల్లి శుభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపారు.

# మిల్లెట్స్ హబ్‌గా హైదరాబాద్

వేద న్యూస్, డెస్క్ : కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సోమవారం హైదరాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్ – భారత సిరిధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) ప్రాంగణంలో 'గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్'కు ఆయన శంకుస్థాపన చేశారు.

సిరిధాన్యాల రంగంలో పరిశోధన, అభివృద్ధి, శిక్షణతో పాటు వాటి ప్రాచుర్యం కల్పించే దిశగా ఈ కేంద్రం ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని శివరాజ్‌సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్ల ప్రాముఖ్యతను మరింతగా పెంపొందించేందుకు ఈ కేంద్రం మార్గదర్శకంగా పనిచేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, వ్యవసాయ పరిశోధకులు, శాస్త్రవేత్తలు, రైతులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## గర్భిణులు,నవజాత శిశువులకు

# మెరుగైన వైద్యం అందించాలి

**– సికేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. వరంగల్ లోని సికేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సోమవారం ఆకస్మికంగా సందర్శించి ఇన్ పేషంట్, ఔట్ పేషంట్, నవజాత శిశువులకు అందిస్తున్న వైద్య సేవల గదులతోపాటు ల్యాబ్ లతో పాటు పలు విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవలకు సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఐపి, ఓపీ సంఖ్యను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు బాలింతలు నవజాత శిశువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలను అందించాలన్నారు. సాధారణ ప్రసావాలు పెంచాలని అన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలతో అందుతున్న వైద్యం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. శానిటేషన్ వ్యవస్థ మెరుగు పరచాలని, సెప్టిక్ ట్యాంక్ వేగవంతంగా శుభ్రం చేయాలన్నారు.



బాలింత పళ్ళెంలో భోజనాన్ని గమనించిన కలెక్టర్ మెనూ పాటించక పోవడం పై వార్డు ఇంచార్జి స్టాఫ్ నర్స్, ఇంచార్జి డైటీషియన్, కాంట్రాక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమో జారీ చేయాలని ఆర్ ఎం ఓ ను ఆదేశించారు. అన్నపూర్ణ భోజనం క్యాంటీన్ ను ఆసుపత్రి బయటకు మార్చాలని ఆస్పత్రి ఇరువైపులా వెంటనే సీసీ కెమెరాలు అమర్చుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ఆర్ఎంఓలు డాక్టర్ మురళి, డాక్టర్ రమేష్, ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ స్వరూప,డాక్టర్ సృజన, కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రయోజనాలు ప్రజలకు తెలుసు

**వేద న్యూస్, డెస్క్:**

కాళేశ్వరం ప్రాజెక్టుపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల విమర్శలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రెండు పార్టీలు ఒక్కటే ఏజెండాతో కలిసి మా పార్టీ అధినేత కెసిఆర్ గారిని బదనాం చేయాలన్న కుట్రతో పనిచేస్తున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక్క వ్యక్తి నిర్ణయం మాత్రమే కాదని,అప్పటి తెలంగాణ మంత్రివర్గం సమిష్టిగా నిర్ణయం తీసుకుందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని కూడా గతంలో మంత్రులుగా పనిచేసిన ఈటెల రాజేందర్ తో పాటు హరీష్ రావు స్పష్టం చేశారన్నారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం ప్రభుత్వ విధానపర నిర్ణయం. ఆచరణలో పెట్టే బాధ్యత అధికారులు, యంత్రాంగం పై ఉంటుంది. కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, కాలేశ్వరం అంశంలో దాచాల్సిందేమీ లేదు. ఇది సంపూర్ణంగా పారదర్శకంగా జరిగిన పనిఅని చెప్పారు. హరీశ్ రావు ప్రజెంటేషన్ చూస్తే అసలు విషయం తెలుస్తుందన్నారు. మొన్న మా మా పార్టీ నేత హరీశ్ రావు చేసిన ప్రజెంటేషన్‌ను చూసి ఉంటే ప్రతి ఒక్కరికీ కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రాధాన్యత, ప్రయోజనం సులభంగా అర్థమయ్యేదని కేటీఆర్ అన్నారు. అరటిపండు వొలిచినట్టుగా హరీశ్ రావు వివరించారు" అని కేటీఆర్ ప్రస్తావించారు. 45 లక్షల ఎకరాలకు నీరు అందించేలా కాళేశ్వరం లాంటి ప్రాజెక్ట్ ను ఇతర దేశాల్లో ఏ నాయకుడు నాలుగు సంవత్సరాలు పూర్తి చేసి ఉంటే, ఆ దేశ చరిత్రలో వారి వారి పేరు అజరామరంగా, శాశ్వతంగా నిలిచిపోయేదని, ఆ నాయకుడి పాలనను ప్రశంసలతో ముంచేత్తేవారన్నారు. కానీ మనదేశంలో మాత్రం రాజకీయ కుయుక్తులు, కుట్రలకు ఇంతటి ఘనమైన కాలేశ్వరం ప్రాజెక్టు పావుగా మారిందని" కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# సంపాదకీయం

## చుట్టుముడుతున్న యుద్ధాగ్ని జ్వాలలు

రష్యాతో భారత్ తన సంబంధాలు తెంచుకోవాలని చెప్పడం ద్వారా అమెరికా దాదాపుగా భారత్‌ను హెచ్చరించినట్లుగానే భావించాలి. అమెరికా వాణిజ్య కార్యదర్శి లుట్నిక్ మాటలు డొనాల్డ్ ట్రంప్ మాటలుగానే భావించాలి. రష్యా వద్ద ఆయుధాలు కొనుగోలు చేయడం వాషింగ్టన్‌ను వ్యతిరేకించడమేనన్న అమెరికా వ్యాఖ్యలు అనుచితం. అమెరికా తన ఆర్థిక దివాళాకోరుతనాన్ని ట్రేడ్ డీల్స్ ద్వారా తేటతెల్లం చేస్తున్నది. భారత్‌పై ప్రతీకార సుంకాలను విధిస్తూ ఇబ్బందిపెట్టాలని చూసిన ట్రంప్‌కు భారత్ కూడా ప్రతీకార సుంకాలతోనే గుణపాఠం నేర్పడానికి సంసిద్ధమైనది. చిరకాల మిత్రులైన భారత్- రష్యాలను విడదీయాలనే దుర్మార్గమైన ఆలోచనకు అమెరికా స్వస్తి చెప్పాలి. ఉగ్రమూకలకు స్వర్గధామమైన పాకిస్తాన్ పట్ల అమెరికా ఉదార స్వభావాన్ని ప్రదర్శించడం సిగ్గుచేటు. ఇటీవల పుతిన్- అజిత్ దోవల్ మధ్య జరిగిన సంభాషణలు అమెరికాకే కాకుండా చైనా, పాక్, బ్రిటన్‌లకు వెన్నులో వణుకు పుట్టించాయి.ఒక వైపు అమెరికా, బ్రిటన్ మరికొన్ని యూరప్ దేశాలు రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధాలను సరఫరా చేస్తున్నాయి. ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ, భారత్‌లో మారణహోమం సృష్టిస్తున్న పాక్‌ను మందలించకుండా భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాల (%వతీతీశీతీఱర ఖ్ష్ఱజుఱవం%) కు వెన్నుదన్నుగా నిలుస్తున్న పాక్‌ను ఎదిరించేందుకు రష్యాతో ఆయుధ ఒప్పందం కుదుర్చుకుంటున్న భారత్‌పై ఈర్ష్యాద్వేషాలను ప్రదర్శిస్తున్న అమెరికా వైఖరి అసమంజసం. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎంతో అందమైన ప్రాంతం. ఉగ్రవాదులతో, జిహాదీ శిక్షణలో ఎలాంటి అభివృద్ధి సాధించకుండా పిఒకె నిస్తేజంగా మారిపోయింది. పిఒకె ప్రజలకు తినడానికి తిండిలేదు. విద్య, ఉపాధి అవకాశాలు లేవు. భారత్‌లోని జమ్మూ కశ్మీర్ ఇందుకు విరుద్ధం.కశ్మీర్ ప్రజలు టూరిజంతో ఉపాధి అవకాశాలు పొందుతున్నారు.

ఉగ్రవాదం వలన జీవితాలు ఎంత దుర్భరంగా మారతాయో అక్కడ ప్రజలకు అర్థమైనది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కొంత కాలం అలజడులు చెలరేగినా అక్కడ జరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలు కశ్మీర్ ప్రజల్లో మార్పును తెచ్చిన మాట కాదనలేని సత్యం. ఎవరో కొద్ది మంది చేసే పనుల వలన కశ్మీర్‌లో ఏదో జరిగిపోతుందనుకోవడం విడ్డూరం. జమ్ముాకశ్మీర్‌లో జరుగుతున్న అభివృద్ధిని గమనించిన తరువాత పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు కూడా భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారు. జై శంకర్, యోగి ఆదిత్యనాథ్, రాజ్ నాథ్ సింగ్ వంటి వారు పిఒకె స్వాధీనం గురించి ఇదివరకే తమ అభిప్రాయాలను కుండబద్దలు గొట్టినట్టు చెప్పారు. పిఒకెను భారత్ స్వాధీనం చేసుకుంటుందా? ఇందుకు చైనా, అమెరికాలు అభ్యంతరం చెప్పి, పాక్‌కు ఆయుధాలు సరఫరా చేసి భారత్‌పై యుద్ధానికి ప్రేరేపిస్తాయా? అనే విషయం తేలాలి. రష్యా- ఉక్రెయిన్ల మధ్య గత మూడున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధాన్ని ఆపడం అమెరికాకు చేతకాలేదు. పైగా ట్రంప్‌ను జెలెన్స్కీ ప్రత్యక్షంగానే విమర్శించిన విషయం మరవలేం. తన మద్దతు లేకపోతే ఉక్రెయిన్ యుద్ధం చేయలేదని డాంబికాలు పలికిన అమెరికాను సవాల్ చేస్తూ, మునుపెన్నడూ లేని విధంగా రష్యాపై ఉక్రెయిన్ స్పైడర్ వెబ్ ఆపరేషన్‌ను చేపట్టి రష్యాను భయపడేలా చేసింది.రష్యాలోని కీలకమైన క్రిమియా బ్రిడ్జిని ఉక్రెయిన్ కూల్చింది. 41 యుద్ధ విమానాలు, ఒక బ్రిడ్జిని ధ్వంసం చేసి పటిష్టమైన రక్షణ వ్యవస్థ కలిగిన రష్యాకు సవాల్ విసిరిన ఉక్రెయిన్‌కు నాటో దేశాలు సహకారం అందించడం వలన జరిగే మహావిలయాన్ని ఊహించగలమా?రష్యా కూడా ఉక్రెయిన్‌కు చెందిన వందలాది మంది సైనికులను హతమార్చినట్టు ప్రకటించుకుంది. ఉక్రెయిన్ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని రష్యా చేసిన హెచ్చరిక ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చెప్పలేం.

రష్యాకు యుద్ధంలో సహాయం చేయడానికి ఉత్తర కొరియా సంసిద్ధత వ్యక్తం చేసింది. వేలాది సైన్యం, ఆయుధాలతో కిమ్ రష్యాకు అండగా ఉండబోతున్నారు. ఉక్రెయిన్ రష్యాపై ఆకస్మికంగా దాడి చేసి ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేయడం అవాంఛనీయ పరిణామంగా భావించాలి. అహం దెబ్బతిన్న రష్యా ఉక్రెయిన్‌పై భారీ స్థాయిలో విరుచుకుపడడానికి సిదంగా ఉంది. రష్యా రిటాలియేషన్ ఏ స్థాయిలో ఉంటుందో ఊహించలేం. ఈ పరిణామాల వలన అమెరికా, నాటో దేశాలు ఉక్రెయిన్ పక్షాన నిలబడి భారీ యుద్ధానికి తెరతీసే అవకాశముంది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దశకు చేరుకుందని అందరూ భావిస్తున్న తరుణంలో అనుకోని విధమైన మలుపులు తిరుగుతూ ప్రపంచాన్ని భయానకమైన వాతావరణంలోకి నెట్టింది. ఉక్రెయిన్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ట్రంప్‌కు స్పష్టం చేసారు. ఎక్స్ ద్వారా ట్రంప్ ఈ విషయాన్ని తేల్చిచెప్పారు. భారత్ -రష్యా సంబంధాలను అమెరికా జీర్ణించుకోలేకపోతున్నది. భారత దేశానికి అంతర్జాతీయంగా అన్నివిధాలుగా సహకరిస్తున్న ఏకైక విశ్వసనీయమైన దేశం రష్యా. అలాంటి రష్యాకు మన దేశం ఎంతో రుణపడి ఉంది. 1971లో జరిగిన ఇండో- పాక్ యుద్ధంలో అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు పాకిస్తాన్‌కు మద్దతు తెలిపినా, అప్పటి సోవియట్ యూనియన్ భారత్‌కు అన్ని విధాలా సాయంచేసి నిజమైన స్నేహానికి నిర్వచనం చెప్పింది. అప్పటి సోవియట్ యూనియన్ నుంచి నేటి రష్యా వరకు భారత్‌కు వెన్నంటి ఉన్న మిత్ర దేశంతో భారత్‌ను వేరుచేయాలని అమెరికా విఫల ప్రయత్నాలు చేస్తున్నది. ఆసియా, ఐరోపా ఖండాల్లో విస్తరించి ఉన్న రష్యా ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో ఒక భాగం. కొన్ని దేశాల కుట్రల వలన, మిఖాయిల్ గోర్బచేవ్ విధానాల వలన ఎంతో ఖ్యాతి గాంచిన సోవియట్ యూనియన్ విడిపోయింది.15 కామన్ వెల్త్ ఇండిపెండెంట్ స్టేట్స్‌లో రష్యా ఒక కీలకమైన దేశం.

సోవియట్ యూనియన్ నుంచి విడిపోయిన రష్యా ఈనాటికీ మిగిలిన ప్రాంతాల కంటే అత్యధిక ఆయుధ, సైనిక బలగం గల దేశం. అప్పటి సోవియట్ యూనియన్ మాదిరిగా రష్యా కూడా ఒక అగ్రరాజ్యం. ప్రపంచంలోనే అత్యధిక విస్తీర్ణంగల దేశంగా మైదానాలతో, వ్యవసాయ భూములతో, సహజ వనరులతో తులతూగుతున్న రష్యా అంటే ఈనాటికీ కొన్ని దేశాలకు గిట్టదు. అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు రష్యాకు బద్ధశత్రువులు. ఇటీవల కాలంలో రష్యాపట్ల స్నేహ వైఖరిని ప్రదర్శించినట్లు నటించిన ట్రంప్ తన దుర్బుద్ధిని చాటుకున్నారు. రష్యా కు భారత్ మరింత సన్నిహితంగా మెలగడం అమెరికాకు నచ్చడంలేదు. అమెరికాలో స్థిరపడ్డ భారతీయులు ట్రంప్ అధికారంలోకి రావడానికి కృషి చేసారు. ఎన్నికల తర్వాత అక్రమ వలసదారుల పేరుతో భారతీయులకు సంకెళ్ళు వేసి, యుద్ధ విమానాల్లో వారిని భారత్‌కు పంపించి, ఘోరంగా అవమానించాడు. భారత్‌ను ప్రశంసిస్తూ, మోడీ తన మిత్రుడంటూనే అమెరికా అధ్యక్షుడయ్యాక ట్రంప్ భారత్‌కు వెన్నుపోటు పొడిచాడు. ట్రంప్ చేష్టలను తట్టుకోలేక అతని ఆప్తమిత్రుడైన ఎలాన్ మస్క్ కూడా ట్రంప్‌ను అభిశంసించి, గద్దె దించాలని, జెడి వాన్స్‌ను అధ్యక్ష స్థానంలో నిలబెట్టాలని ప్రయత్నించడం గమనార్హం. భారత్ విషయంలో కూడా ట్రంప్ ధోరణి సముచితంగా లేదు. ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్య దేశంగా, అత్యధిక జనాభా గల దేశంగా భారత్ తన సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుకోవడానికి ఎంతో కృషి చేస్తున్నది. ఈ క్రమంలో రష్యా భారత్‌కు అన్ని విధాలా అండగా ఉంటున్నది. చైనా, పాకిస్తాన్, అజర్ బైజాన్, బంగ్లాదేశ్, టర్కీ వంటి దేశాలు భారత్‌పట్ల అకారణ విద్వేషాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఒకప్పుడు ఇండో- చీనీ భాయ్‌భాయ్ అంటూనే 1962లో భారత్‌తో యుద్ధానికి తలపడి, భారత్ భూభాగాలను ఆక్రమించి చైనా నమ్మకద్రోహం చేసింది. టిబెట్ బౌద్ధ గురువు దలైలామాకు భారత్ ఆశ్రయమివ్వడమనే అంశంతో చైనా భారత్‌తో యుద్ధానికి దిగిందనే వాదనలో పసలేదు.

భారత్ లోని ఈశాన్య ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకోవడమే లక్ష్యంగా నాడు చైనా యుద్ధం చేసింది. చికెన్ నెక్‌గా పిలవబడుతున్న సిలిగురి కారిడార్‌ను వివాదాస్పదం చేసి ఈశాన్య భారతాన్ని మింగేయడానికి డ్రాగన్ దేశం విస్తృతంగా ప్రయత్నిస్తున్నది. భారత భూభాగాలను తమవిగా పేర్లు మార్చుకుంటూ భౌగోళిక పటాలను సృష్టిస్తున్నది. పాక్‌తో అంటకాగుతూ భారత్ సార్వభౌమత్వాన్ని ప్రశ్నిస్తున్నది.ఇక పాకిస్తాన్ విషయం వేరే చెప్పాల్సిన అవసరం లేదు. పాకిస్తాన్ స్వతంత్ర దేశంగా ఏర్పడినప్పటికీ, భారత్‌ను ఇంకా ఉగ్రవాదంతో ఇబ్బందులకు గురిచేస్తున్నది. భారత్‌లో కశ్మీర్ విలీనం రాజా హరిసింగ్ నేతృత్వంలో చట్టబద్ధంగా జరిగినా కశ్మీర్‌లోని కొంత భూభాగాన్ని పాక్ ఆక్రమించుకుంది. అదే పాక్ ఆక్రమిత కశ్మీర్. పాక్ ఆక్రమిత కశ్మీర్ కేవలం ఉగ్రవాదులకు నిలయం.ఇక్కడ నుండే ఉగ్రవాద కార్యకలాపాలను పాక్ కొనసాగిస్తూ, ఎల్ఒసివద్ద కాల్పులు జరుపుతూ, కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి ప్రవేశపెట్టి, భారత్‌లో అమాయకుల ప్రాణాలను బలితీసుకుంటున్నది. పహల్గాం దారుణ మారణకాండకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు బుద్ధి చెప్పింది. భారత్ ఆయుధ శక్తికి బెంబేలెత్తిన పాక్ కాల్పుల విరమణకు ప్రతిపాదన చేయడంతో భారత్ తాత్కాలికంగా శాంతించింది. అయినప్పటికీ పాక్, పాక్‌కు వత్తాసు పలుకుతున్న శత్రుదేశాల కుయుక్తులనుండి దేశాన్ని కాపాడుకోవడానికి భారత్ తన మిత్రదేశమైన రష్యాతో ఆయుధాల విషయంలో సంప్రదింపులు జరుపుతున్నది. అమెరికాకు భారత్ వైఖరి నచ్చడం లేదు.

## కరోనా కలకలం..

# ఆరు వేలు దాటిన యాక్టివ్ కేసులు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

ప్రపంచదేశాలను గడగడలాడించిన కరోనా మరోసారి భారత్‌లో విజృంభిస్తోంది. దేశవ్యాప్తంగా కొత్తగా 1,131 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో యాక్టివ్ కేసుల సంఖ్య 6 వేలు దాటింది. ఆదివారం ఉదయం 8 గంటల నాటికి కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 6,133గా ఉన్నట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.ప్రస్తుతం కేరళలో 1950, గుజరాత్‌లో 822, బెంగాల్‌లో 693, మహారాష్ట్రలో 595, కర్ణాటకలో 366, ఎపిలో 86, తెలంగాణలో 10 యాక్టివ్ కేసులు ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో కోవిడ్ (%జశీజుఱు%-19) కారణంగా ఆరుగురు మృత్యువాతపడ్డారు. కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, తమిళనా డులో ఒకరు మృతి చెందారు. దీంతో ప్రజల్లో మరోసారి భయాందోళనలు మొదలయ్యాయి. కేరళలో గత 24 గంటల్లో 192 కేసులు నమోదు కాగా.. గుజరాత్‌లో 107, బెంగాల్‌లో 58, కర్ణాటకలో 15, ఆంధ్రప్రదేశ్‌లో 12 కొత్త యాక్టివ్ కేసులు వెలుగుచూశాయి.



అత్యధిక పాజిటివ్ కేసుల్లో కూడా కేరళ ముందు స్థానంలో ఉంది. ఆ తర్వాత ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, ఉత్తర్‌ప్ర దేశ్, రాజస్థాన్ ఉన్నాయి. అయితే ప్రస్తుతం కేసుల వ్యాప్తికి కారణమైన ఒమిక్రామ్ సబ్‌వేరి యంట్లు, లీనియేజ్‌లు అప్పర్ రెస్పిరేటరీ పైనే ప్రభావం చూపుతున్నందున ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదని నిపుణులు అంటున్నారు.

# సూట్‌కేస్‌లో తొమ్మిదేళ్ల బాలిక మృతదేహం

**వేద న్యూస్, డెస్క్:**

ఈశాన్య ఢిల్లీలోని దయాల్పూర్ ప్రాంతంలోని ఓ సూట్ కేసులో తొమ్మిదేళ్ల బాలిక మృత దేహం లభ్యమైంది. ఆమెపై అత్యాచారం చేసి, చంపేసి ఉంటారన్న ఆరోపణలను ఆమె కుటుంబ సభ్యులు చేశారు. దీనిపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. స్థానికులు కూడా ఆ మైనర్ బాలికపై అత్యాచారం, హత్యకు పాల్పడి ఉంటారన్న ఆరోపణలు చేశారు. శనివారం సాయంత్రం ఆ బాలిక మృతదేహం లభ్యమైంది. అక్కడ శాంతిభద్రతలను కాపాడడానికి పోలీసులు, పారామిలిటరీ సిబ్బందిని మోహరించారు. ఈ దారుణ నేరానికి పాల్పడిన వ్యక్తి మృతదేహాన్ని సూట్‌కేస్‌లో కుక్కి పారిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. లైంగిక దాడి సహా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు. 'మరణానికి కారణాన్ని నిర్ధారించడానికి మేము శవ పరీక్ష నివేదిక కోసం ఎదురు చూస్తున్నాము. పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి బృందాలను ఏర్పాటు చేసాయి. ఈ విషయాన్ని మేము అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నాము' అని ఓ పోలీసు అధికారి అన్నారు. నెహ్రూ విహార్ నివాసి అయిన ఆ బాలిక శనివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో సమీపంలో నివసిస్తున్న బంధువుకు ఐస్ ఇవ్వడానికి వెళ్లిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.



దయాల్పూర్ పోలీస్ స్టేషన్‌లో బిఎన్ఎస్ పోక్సో చట్టం సెక్షన్ 6 కింద కేసు నమోదుచేసినట్లు సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ఆ బాలిక తల్లి ఓదార్చలేని దుఃఖంలో మునిగిపోయింది.

# పెంచిన బస్‌పాస్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

**వేద న్యూస్, డెస్క్:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాధారణ ప్రజల, విద్యార్థుల బస్‌పాసులను 20శాతానికిపైగా పెంచి ప్రయాణీకులపై విపరీతమైన భారం మోపింది. గ్రేటర్ హైదరాబాదు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ఒక్కో ప్రయాణీకునిపై రు.250 నుండి 300ల వరకు ప్రతి నెలా భారం పడుతున్నది. పేదలు ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో ఇంత పెద్దఎత్తున ఛార్జీలు పెంచడం ప్రభుత్వానికి, టీజీ ఆర్టీసీ సంస్థకు తగదు. తక్షణమే పెంచిన బస్‌పాస్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు మహాలక్ష్మి పేరుతో ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణమంటూనే, మరో ప్రక్క ప్రతిరోజూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి చిన్నచిన్న పనులు చేసుకునే వారిపై ఈ ఛార్జీలు పెనుభారమౌతాయి. ఇప్పటికే నిత్యావసర ధరలతో సతమతమౌతున్న పేద కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. బస్‌పాస్ ఛార్జీలను పెంచడమంటే ఒకచేత్తో కొంత



ఇచ్చినట్టే ఇచ్చి, మరోచేత్తో అందినంత దోచుకోవడమే.

# అర్చక, ఉద్యోగులకు గ్రాట్యుటీ

# రూ 4 లక్షల నుండి రూ 8 లక్షలకు పెంపు

**వేద న్యూస్, డెస్క్:**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాయాలయాల్లో పని చేస్తున్న అర్చకుల చిరకాల కోరికను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీర్చారు. అన్ని ఆలయాల్లో సుదీర్ఘ కాలంగా సేవలు అందిస్తున్న అర్చక, ఉద్యోగ సంక్షేమ నిమిత్తం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేశారు. సోమవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎండోమెంటు ప్రిన్స్‌పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ వెంకటరావు తదితర అధికారులతో అర్చక, ఉద్యోగ సంక్షేమ నిధి పోస్టరును రిలీజ్ చేశారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ... అర్చక, ఉద్యోగుల కోసం తమ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ సంక్షేమ ట్రస్టు ద్వారా దేవాదాయ శాఖ పరిధిలో గల సహాయ కమీషనర్ స్థాయి వరకు గల దేవాలయాలలో పని చేసే సుమారు 13,700 మంది అర్చకులు, ఇతర ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని ఆమె వ్యాఖ్యానించారు. అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యూటి ఇవ్వడం జరుగుతుందన్నారు. ధూపదీప నైవేద్య అర్చకులకు మరణానంతరము చెల్లించు గ్రాట్యూటి నిర్ధారించినట్టు చెప్పారు. మరణానంతరము చెల్లించు ఎక్స్ గ్రేషియా, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తము చెల్లింపు ఈ నిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ నిధి కింద



ఉద్యోగులకు.... మెడికల్ రీయింబర్స్ మెంట్, వివాహ నిమిత్త పథకం, ఉపనయన పథకం, గృహ నిర్మాణ, కొనుగోలు మరియు మరమ్మత్తుల నిమిత్త పథకం, విద్యా పథకం, విధులు నిర్వహించలేని వికలాంగులైన ఉద్యోగులకు ఆర్థిక సహాయ పథకం అందజేయడం జరుగుతుందన్నారు. పైన పేర్కొన్న పథకాలలో రెగ్యులర్ అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యూటి పథకానికి 28.05.2025 రోజున అర్చక సంక్షేమ బోర్డు వారు గతంలో చెల్లించిన గ్రాట్యుటీ రూ 4 లక్షల నుండి రూ 8 లక్షలకు పెంచినట్టు చెప్పారు. ఇట్టి గ్రాట్యుటీ మొత్తమును సదరు ఉద్యోగి యొక్క బ్యాంకు ఖాతాలో ఏక మొత్తములో వారి సర్వీసు కాలమునకు లోబడి చెల్లిస్తామన్నారు. ఎవరైనా అకాలం చనిపోతే, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ20,000/- ల నుండి రూ 30,000/- లకు పెంచినట్టు చెప్పారు. కాగా, ఈ అంశానికి సంబంధించి ప్రాంతీయ, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులు అర్చక, ఉద్యోగ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేస్తారని మంత్రి వివరించారు. ఈ నిర్ణయంతో అర్చకులు, దేవాదాయ శాఖ ఉద్యోగులకు పెద్ద ఎత్తున లబ్ది జరుగుతుందని మంత్రి కొండా సురేఖ ఆశాభావం వ్యక్తం చేశారు.

వేద న్యూస్

మంగళవారం జూన్ 10, 2025

# ఆపరేషన్ కగార్ ను ఆపివేయాలి




మొదటి పేజీ తరువాయి


నడుచుకునే ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని గౌరవించి విప్లవకారులతో చర్చలు జరపాలన్నారు. పౌర హక్కుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు రమేష్ చందర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో విప్లవకారులను చంపడానికి వెళు _న్న పోలీసులు, పారా మిలటరీ బలగాలు ఏకపక్షంగా కాల్పులు జరుపుతూ కనీసం విప్లవ కారుల శవాలను కూడా వారి కుటుంబ సభ్యులకు ఇవ్వకుండ, అమరుల కుటుంబ సభ్యుల పట్ల బీజేపీ ప్రభుత్వం కర్కషంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. అలాగే వీసీకె పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతు రాజ్యాంగాన్ని ఉల్లంఘించే హక్కు ఏ ప్రభుత్వానికి లేదని, మధ్య భారతదేశంలో ఉన్న ఈ దేశ మూల వాసులపై కేంద్ర ప్రభుత్వ పార మిలటరీ బలగాల తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం వెంటనే విప్లవ కారులతో చర్చలు జరిపాలని, మధ్య భారతదేశం లో జరుగుతున్న రాజ్యాంగ ఉల్లంఘనలను ఆపివేయాలి అన్నారు. భారత్ బచావో రాష్ట్ర నాయకులు వెంగల్ రెడ్డి మాట్లాడుతూ మావోయిస్టు చర్చలకు సిద్ధం అని ప్రకటిస్తున్న కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోవడం రాజ్యాంగ వ్యతిరేకమే అని మండి పడ్డారు. సిపిఐ( యంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు రాచర్ల బాలరాజు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ వలన ఆదివా సుల హక్కులు ప్రమాదంలో పడ్డాయని, ప్రజల జీవించే హక్కుపైన కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విరసం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు కుమారస్వామి, తెలం గాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కార్యదర్శి కుమారస్వామి, పీస్ కమిటీ రాష్ట్ర నాయకులు సాధిక్ అలీ, అభ్యుదయ రచయితల సంఘం నాయకులు శంకర్ నారాయణ మార్క్స, సైంటిఫిక్ స్టడీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ చార్వక, పి డి ఎస్ యు ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మఠ్రి మహేశ్, టి ఎస్ డి ఎస్ ఏ రాష్ట్ర కన్వీనర్ క్రాంతికుమార్, బిఎస్ఎఫ్ కేయూ అధ్యక్షులు శివ, బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి జున్ను రాజు, తెలంగాణ స్టూడెంట్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీధర్, ఏఐడీఎస్ఓ కేయు అధ్యక్షులు మధు, ప్రోగ్రెసీవ్ స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సనత్ జై సూర్య, డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, బిఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు బొట్ల మనోహర్, యువ రచయితల సంఘం నాయకులు హథిరాంలతో పాటు పలు సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యకవాదులు మేధావులు, విద్యార్థి సంఘ నాయకులు, యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక కార్యక్రమాలు చేపట్టామని ఇందులో భాగంగా మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ పంప్ లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలలో మహిళా సంఘాలకు పెట్రోల్ పంప్ ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని, ఒక పెట్రోల్ పంప్ ఏర్పాటు వల్ల 10 కుటుంబాలు బాగు పడతాయని మంత్రి అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల ద్వారా రైస్ మిల్స్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల స్థాపన, ఆర్టీసీ కు అద్దె బస్సులు నడపడం వంటి అనేక కార్యక్రమాల అమలు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నవంబర్ నాటికి జిల్లాలో చేపట్టిన నూతన ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తి చేయాలని ఈ మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గత నవంబర్ మాసంలో శంకుస్థాపన చేసుకున్నామని, చాలా జిల్లాలో వీటి పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ల సమన్వయం చేసుకుంటూ నిర్దేశించుకున్న గడువు లోపు పనులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు.

మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ఏకరూప దుస్తులు కుట్టు పనులు వేగంగా జరిగాయని, దీనికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. జూన్ 12న పాఠశాలలో పునః ప్రారంభోత్సవం సందర్భంగా పండగ వాతావరణం లో పిల్లలకు ఏకరూప దుస్తులు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభోత్సవం సందర్భంగా పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేయాలని పిచ్చి మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పిస్తూ నూతన మహిళ సంఘాలను ఏర్పాటు చేయాలని, పేదరికం అధికంగా ఉండే ప్రాంతాలలో అవగాహన కల్పిస్తూ మహిళా గ్రూపుల వల్ల కలిగే బెనిఫిట్స్ పై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర రుణాల కోసం మహిళలు పోయే దుస్థితి రాకుండా, జిల్లాలో పూర్తి స్థాయిలో నూతన మహిళా సంఘాలను తయారు చేసి మహిళలను గ్రూపు లలో చేర్పించాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ గాంధీ జయంతి నాటికి పూర్తి చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో మహిళా సంఘాల ద్వారా విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం సబ్ స్టేషన్ పరిధిలో 8 ఎకరాల అనువైన భూమి 10 రోజుల్లో గుర్తించాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా మాట్లాడుతూ జిల్లాలో యూనిఫాం లు 34,878 యూనిఫాంలు స్టిచ్చింగ్ 100శాతం పూర్తి అయిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయక బృందాల ద్వారా జిల్లాలోని నర్సంపేట , వరంగల్లులో అనుమైన ప్రాంతాల్లో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి, జెడ్పి సీఓరాంరెడ్డి, డి ఆర్ డి ఓ కౌసల్యాదేవి, డిడబ్ల్యుఓ రాజమణి తదితరులు పాల్గొన్నారు.



# మహాలక్ష్మి పథకం వల్లే ఆర్టీసీ లాభాల్లో ఉంది

మొదటి పేజీ తరువాయి



అవసరాలు తీరుస్తూ వాతావరణాన్ని కాపాడుకుంటూ ముందుకు వెళ్తుందని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని ఆడపడుచులు అందరు ఆర్టీసీ బస్సుల ద్వారా రాష్ట్రము లొ ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లేందుకు ఉచితంగా తీసుకెళ్లడం జరుగుతుందని ఇప్పటివరకు రూ.182 కోట్ల జీరో టికెట్లు జారీ చేశామని వాటి ద్వారా తెలంగాణ ఆడపడుచులు 6088 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని ఆ డబ్బులు ప్రభుత్వం ఆర్టీసీకి నేరుగా జమ చేయడం జరిగిందని దానితో నేడు ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకొని పూర్తి సామర్థ్యంతో రాష్ట్రమంతా బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను కాపాడేందుకు మారుతున్న మార్పులను అప్డేట్ చేసుకుంటూ భవిష్యత్ తరాలకు అందించడం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలిపారు.రాష్ట్ర రవాణా, బి సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చుట్టూ సూర్యాపేట నడుమ నల్గొండ అంటూ తెలంగాణ సాయుధ పోరాటం గుర్తు చేసుకుంటూ ప్రజాప్రభుత్వం లో మారుతున్నా కాలానికి అనుగుణంగా, కార్మికుల సంక్షేమం కోరుకుంటూ నేడు సూర్యాపేట డిపో నుండి హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం, వరంగల్, కోదాడ లాంటి ప్రాంతాలకి వాతావరణంను కాపాడుకుంటూ 79 ఎలక్ట్రికల్ బస్ లు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. వాటిలో నేడు 45 ఎలక్ట్రికల్ బస్ లు ప్రారంభం చేయటం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ లో ఎలక్ట్రికల్ బస్ లు నడుస్తున్నాయని త్వరలో నల్గొండ లో కూడా ఎలక్ట్రికల్ ఛార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేసి బస్ లు మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు అమ్మగారి ఇంటికి, పుణ్య క్షేత్రాలకి ఉచితంగా ఆర్టీసీ ద్వారా ప్రయాణిస్తున్నారని అన్నారు. ఇందుకు గాను ప్రతి నెల 300 నుంచి 350 కోట్ల రూపాయలు ఆర్టీసీకి ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇస్తున్నారని తెలిపారు.ఈ ఆర్థిక సహాయం ద్వారా కార్మికుల సంక్షేమం, భవిష్య నిధి, నూతన బస్సులు, కారుణ్య నియామకాలు ఇస్తున్నామని తెలిపారు.గత 10 సంవత్సరాలు ఒక్క నూతన బస్సు గాని,కొత్త ఉద్యోగం గానీ ఇవ్వకుండా ఆర్టీసీని నష్టాల ఊబిలో కురుకొనిపోయేలా చేశారని ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వేలాది కొత్త బస్సులు, ఉద్యోగాలు నియమించటం జరిగిందని అన్నారు.ఆర్టీసీని పరిరక్షించుకుంటూ గ్రామాలకు రవాణా వ్యవస్థ చేరుకునేలా భవిష్యత్తులో కొత్త బస్సులు కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్యం నుండి వాతావరణాన్ని కాపాడుకునేందుకు కాలుష్య రహిత ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేస్తుందని,మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా సేవలు అందించి ఆర్థికంగా ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పి నరసింహ,ఎమ్మెల్యే లు నలమాద పద్మావతి రెడ్డి, మందుల సామెల్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న యాదవ్ సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డి వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఎక్స్క్యూటివ్ డైరెక్టర్లు ఉపేష ఖాన్,వెంకన్న, జేబీఎం సంస్థ ప్రతినిధి ప్రభాకర్, ఆర్టీసీ అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భార్య వేధింపులు తాళలేక

# భర్త ఆత్మహత్యాయత్నం !

మొదటి పేజీ తరువాయి

ఇంటికి తిరిగొచ్చిన ప్రవీణ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి హన్మకొండకు వెళ్లాడు. ఈ నేపథ్యంలోనే 8వ తేదీన అక్కడే గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయాన్ని తన అన్న ప్రసాద్‌కు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వెంటనే ప్రవీణ్‌ను ఓ ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి తిరుమలగిరిలోని మిలటరీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఆత్మహత్య యత్నం కు ముందు ప్రవీణ్ సూసైడ్ నోట్ రాశారు. 'డియర్ ఫ్రెండ్స్ నేను చనిపోతున్నా. నా చావుకి కారణమెవరో వాళ్లకు తెలుసు. వాళ్ల టార్చర్ తట్టుకోలేకపోతున్నా. అన్నా అమ్మను జాగ్రత్తగా చూసుకో. మన గ్రామంలో వాలీబాల్ టీమ్ బతకాలి. ఎప్పుడూ గేమ్‌ను వదలొద్దు' అని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు.

## మోడీ హయాంలో


# రాజ్యాంగ సంస్థల హైజాక్



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

ప్రధాని మోడీ ప్రభుత్వంలో రాజ్యాంగ సంస్థలు హైజాక్ అయ్యాయని ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ వ్యాఖ్యానించారు. మోడీ ప్రభుత్వం ఎన్నికల సంఘం (ఈసీ) వంటి రాజ్యాంగ సంస్థలను హైజాక్ చేస్తోందని, ఎన్నికల తేదీలు ప్రకటించకముందే అధికార బీజేపీ ఎన్నికల షెడ్యూల్ గురించి ఎలా తెలుసుకుంటుందని అన్నారు. "2014లో కేంద్రంలో మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని రాజ్యాంగ సంస్థలూ హైజాక్‌కు గురయ్యాయి. ఎన్నికల తేదీలను ఈసీ ప్రకటించడడానికి ముందే బీజేపీ ఐటీ సెల్ తెలుసుకుంటోంది. ఇలా చాలా పరిణామాలను గమనించాం" అని అన్నారు. రాజ్యాంగ సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన అవసరమున్నదని, వాటిపై ప్రభావం పడితే ప్రజలు ఎలా న్యాయం ఆశించగలరని ప్రశ్నించారు. 2020లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నిష్పక్షపాతంగా, న్యాయంగా జరగలేదని విమర్శించారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వుందని అన్నారు. సాయంత్రానికి ఓట్ల లెక్కింపు ఆగిపోయిందని, సమర్థించుకునేందుకు ఈసీ మూడు మీడియా సమావేశాలను నిర్వహించిందని చెప్పారు. రాత్రిపూట తిరిగి లెక్కింపు ఎందుకు ప్రారంభించారని, విజేతలుగా ప్రకటించబడిన మహాఘట్‌బంధన్ అభ్యర్థులు తర్వాత ఓడిపోయినట్టుగా వెల్లడించారని, వీటికి ఈసీ సమాధానమివ్వాల్సి ఉన్నదని తేజస్వీయాదవ్ పునరుద్ఘాటించారు. మహారాష్ట్ర ఎన్నికలపై ఇండియా బ్లాక్ నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలకు మద్దతు ప్రకటిస్తున్నానని అన్నారు.

# మరోసారి భగ్గుమన్న మణిపూర్



**వేద న్యూస్, డెస్క్ :**

మణిపూర్ ఆదివారం మరో సారి భగ్గుమంది. తెగల మధ్య ఇన్నాళ్ల సంకుల సమరం మరింత అరాచకానికి దారితీసింది. మైతీ తెగ నాయకుడు అరంబాయ్ టెన్గోల్ (ఎటి) వర్గం నాయకుడు కన్నన్‌సింగ్ అరెస్టు తరువాత నిరసనలు చెలరేగాయి. ఈ దశలోనే నిరసనకారులు తమ వంటిపై పెట్రోలు పోసుకుని , ఆత్మాహుతికి పాల్పడుతామని బెదిరించిన ఘటనల వీడియోలు ఇప్పుడు మణిపూర్ అంతటా ప్రచారంలోకి వచ్చాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకు అధికార యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టింది. ఇంఫాల్ లోయ ప్రాంతంలోని ఐదు జిల్లాలో వెంటనే ఇంటర్నెట్ సౌకర్యం నిలిపివేశారు. వదంతులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. భద్రతా బలగాలు పలు చోట్ల పహారా సాగిస్తున్నాయి. జిల్లాల్లో నిషేధాజ్ఞలు వెలువరించారు. శనివారం రాత్రి మైతీ తెగ నేతను పోలీసులు అరెస్టు చేసి తీసుకువెళ్లారు. విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలియగానే ఆయన అభిమానులు పెద్ద ఎత్తున వీధులలోకి వచ్చారు. కొన్ని ప్రాంతాలలో నల్లటి దుస్తులు వేసుకున్న నిరసనకారులు తమను తాము కాల్చుకుంటామని బెదిరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తమ నేతను విడిచిపెట్టాలని నిరసనకారులు పోలీసులతో తలపడ్డారు. ఈ దశలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. పలు చోట్ల తెగల నడుమ ఘర్షణలు చోటుచేసుకుంటున్నట్లు అనధికారిక వార్తలు వెలువడ్డాయి. తమ ముందు కన్పించిన ప్రభుత్వ సిబ్బందితో నిరసనకారులు ఘర్షణలకు దిగారు. దీనితో వీరిని అదుపులో పెట్టడం సమస్య అయింది. భద్రతా బలగాలతోనే నిరసనకారులు తలపడిన వార్తలతో ఉద్రిక్తతలు రాజుకున్నాయి. ఇంఫాల్‌లో పరిస్థితి దిగజారింది. ఓ గుంపు ఖురాయ్ లాంలంగ్ ప్రాంతంలో ఓ బస్సుకు నిప్పు అంటించింది. రాజ్‌భవన్‌కు అతి సమీపంలోనే ఈ ఘటన జరిగింది. అల్లరిమూకలను చెదరగొట్టేందుకు భద్రతా బలగాలు శ్రమించాల్సి వచ్చింది. పలుసార్లు భాష్పవాయువు ప్రయోగించారు. కొన్ని ప్రాంతాలలో అల్లరిమూకలు కాల్పులు జరిపిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. అయితే వీటిపై అధికారులు ఎటువంటి ప్రకటన వెలువరించలేదు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073